


## అతడు.... ఆమె..... - బాలి




"రాజారావ్ - రాజారావ్!"

"ఓ రాజారావ్ నిన్నే - రాజారావ్" - ఈ మాటు ఇంకా పెద్ద పిలుపు. నల్లగా ఆకాశం నిండా మబ్బులు - ఊరంతా చీకటి పడిపోయినట్టు మసక వెలుతురు - దానికి తోడు చల్లని పెంకి గాలి. - హోర్డింగులూ, చిత్తుకాగితాలూ గాల్లో కెగిరిపోతున్నాయి. - ఏక్షణానన్నా వర్షం పడే సూచన. జనం అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. ఆగిన సిటీ బస్‌లోంచి ఓ పదిమంది గబగబా దిగారు. మరో పాతికమంది తోసుకుంటూ ఎక్కారు. అలా దిగిన వాళ్ళలో రాజారావు ఒకడు.

"అమ్మ దేవుడోయ్! వర్షం పడితే చితకబాదేటట్టుంది. చేతిలో గొడుగున్నపుడు రాదే దిక్కుమాలిన వర్షం" - జనాన్ని, ఆగిన రిక్షాలనూ తప్పించుకుంటూ గబగబా అడుగులు వేస్తున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే ఈ పిలుపులు

"రాజారావ్! నిన్నే -"

పిలుపు వచ్చిన వేపు చూస్తే రిక్షాలో వేదవతి కూచుని నవ్వుతూ ఇటే చూస్తోంది.

"వేదా! నువ్వా" అన్నాడు

"ఆఁ నేనే - చాన్నాళ్ళకు కనపడ్డావ్ - నువ్వా! కాదా!! అనుకున్నాను - నువ్వే!!"

"వర్షం వచ్చేట్టుంది -"

"మొక్క మొలిచి పోవు లేవోయ్! మొన్న మొన్నటి దాకా ఎండలు మండిపోయాయి"

టపటపమని రెండు చల్లని చినుకులు రాజారావు చేతిమీద పడ్డాయి. గబుక్కున చేతిలోని పుస్తకాన్ని జుట్టు తడవకుండా నెత్తికడ్డంగా పెట్టుకున్నాడు.

"ఏమిటి సంగతి?"

"ఏముంది !!- రేడియో నాటకంలో ఏదో చిన్న వేషం ఇచ్చారు. ఓ రెండు పేజీల డైలాగులు - రికార్డింగ్ అయిపోయిందిలే. వచ్చేనెల మొదటివారంలో ప్రసారం అవుతుందనుకుంటాను. ఇదిగో - ఇలా రిక్షా ఎక్కానో లేదో నువ్వు కనపడ్డావ్!"

ఈ లోపు చిన్న చినుకులు కాస్త పెద్దవయ్యాయి - రాజారావు చొక్కా, భుజాలు తడుస్తున్నాయి. రిక్షాలో కూర్చున్న వేదవతి కింద చీర అంచులు - చెప్పులూ - కాలి వేళ్ళకున్న మట్టెలు తడుస్తున్నాయి.

"సర్లే - రెండూ మూడు రోజుల్లో వీలు చూసుకుని వస్తాను. వరప్రసాదుగారు బాగున్నారా?"

"నా పాలిట వరప్రసాదం - బాగుండక ఛస్తాడా!?" అంది నవ్వుతూ. నడుస్తున్న రిక్షావాడు తొందరపెడుతున్నాడు.

"మరచిపోకు" అంది చివరగా.

రిక్షా కదలబోతోంది. రాజారావు జేబులో చెయ్యి పెట్టి ఓ పదిరూపాయలు లాగి ఆమెకందించాడు.

"నా దగ్గరున్నాయి" అంది కంగారుగా.

"ఫరవాలేదు రిక్షా వాడికివ్వు" అని చెప్పి బస్ షెల్టర్ వేపు పరుగుతీశాడు.

***

వేదవతి కాకినాడ రామారావు పేటలో ఉన్నప్పట్నించీ రాజారావుకి తెలుసు. తన పెద్దక్క రుక్కికి స్నేహితురాలే ఈమె. పక్క వీధే తరచూ వచ్చేది. అందరి ఆడపిల్లల్లోకీ గడుగ్గాయి అని పేరు తెచ్చుకుంది. "మనం భయపడ్డామనుకో ఈ సమాజం మనల్ని ఇంకా భయపెడుతుంది. మనం ఎదురు తిరిగితే తోకముడుస్తుంది" అనేది తరచూ -

"మనమయితే భయపడి తలలు దించుకున్నాం గానీ ఆ సమయంలో ఈ వేదవతే ఉంటేనా! వాడి పిలక కత్తిరించి వాడి చేతిలోనే పెట్టేది" అని ఎంతో ఇదిగా వారి మిత్రబృందం చెప్పుకుని విరగబడి నవ్వుకునేవారు. వేదవతికి నటించడవచ్చు. రెండు మూడు పిక్చర్‌లలో ఏవో వేషాలు వేసింది. ఆ తరువాత ప్రయత్నాలు చెయ్యలేదు.

"వాడు చచ్చాడుగా! మహేశ్వరం గాడు - వాడి పిక్చర్‌లలోనే వేషాలు వేశాను వాడు పోయినతర్వాత మనకెవడిస్తాడు వేషాలు? - అయినా ఆ వెధవలు చుట్టూ తిరగలేన"ంటుంది సినిమాలు గురించి అడిగినపుడు.

- బాగా పాడుతుంది. అయితే అవి కూడా మంగళహారతులవరకూ వచ్చి ఆగిపోయాయి. కథలూ గట్రా రాస్తుంది. పాతిక వరకూ అచ్చయ్యాయి. ఇంకా రాయగలదు. మధ్యలో బద్ధకం. ఇప్పుడు చదవడం వరకే పరిమితమయ్యింది. కనపడ్డ పుస్తకమల్లా చదవకుండా వదిలిపెట్టదు. గొంతు బాగుండడం వల్ల, మాడ్యులేషన్ స్పష్టంగా తెలియడం వల్ల, ప్రస్తుతం రేడియో నాటకాలలో పాల్గొంటోంది, అడపా తడపా అవకాశాలు వస్తే. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళయిపోయి, అత్తారిళ్ళకు వెళ్ళిపోయి, మగపిల్లలకు చదువులూ అయి ఉద్యోగాల వేటలో ఊళ్ళుపట్టుకు తిరుగుతున్న దశలో పదిపదిహేను సంవత్సరాలపాటు వేదవతి ఎక్కడుందో - అత్తగారిదేవూరో రాజారావుకి తెలియలేదు. తరువాతెప్పుడో పెద్దక్క రుక్కు కలిస్తే మాటల సందర్భంలో కొంచెం తెలిసింది - వేదవతికి పెళ్ళయ్యింది. అత్తగారు కావాలని కొడుక్కి చేసుకుంది. కట్నం అక్కర్లేదని తమకే బోల్డు ఆస్తి ఉందని చెబితే పిల్ల సుఖపడుతుందని, పెద్దింటివారనీ

తలంచారు. అయితే వాడో బడుద్దాయని, అప్రయోజకుడనీ, తినమంటే ఎంతన్నా తిని, పడుకొమ్మంటే రోజులు తరబడి పడుకోటం అలవాటనీ తరువాత తెలిసింది. విశాఖపట్నంలో స్వంత ఇల్లు పెద్దిల్లేనని... అంతవరకే తనకు తెలుసునని చెప్పింది ఆమె.

రాజారావుకి రైల్వేలో ఉద్యోగం. భువనేశ్వర్ నుండి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. ఒకమారు ఏదో సినిమాకు వెళితే అందులో హీరోయిన్ తల్లిగా వేదవతి కనపడింది. పెద్ద పాత్రే. ఈవిడ సినిమాల్లోకి చెక్కేసిందన్నమాట అనుకున్నాడు రాజారావు.

తన ఆఫీసులో కొలీగ్ మాటాడుతున్న సందర్భంలో అతను - వేదవతి తమ దూరపు బంధువేనని, ఆమె గురించి మాటాడ్డం పాపం చుట్టుకుంటుందని - సెలవిచ్చాడు. అయినా రాజారావు వేదవతితో ఉన్న తన పరిచయాన్ని మామూలుగా చెప్పి ఊరుకున్నాడు. ఈలోపు మరి కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఓ రోజు ఉదయం ఫోన్ వస్తే రాజారావు తీశాడు. డాబా గార్డెన్స్‌లో ఉంటున్న తన ఆఫీస్ కొలీగ్ చెపుతున్నాడు ఫోనులో "వేదవతి వచ్చింది - ఇపుడు మా ఇంట్లోనే ఉంది - వస్తావా?" అని. ఎంతో ఉత్సాహంతో రాజారావు వెళ్ళాడు - ఇతను వెళ్ళేసరికి హాల్లో సోఫాలో కూచుని ఉంది. వంటి మీద పెద్ద జరీ ఆకులతో వెంకటగిరి చీర, వళ్ళో తెల్లని హేండ్ బాగ్ - గుర్తు తెచ్చుకుంటూ సరదాగా పలకరించింది. తెలుసున్న వాళ్ళ గురించీ, వీళ్ళ గురించీ అడిగింది. తన గురించి మాత్రం చెప్పీచెప్పనట్టు చెప్పింది. ఆమె అడిగిన వాటిన్నిటికీ సమాధానాలు చెప్పి ఆమె ముఖంలోకే చూస్తున్నాడు రాజారావు. ఆమెలో అసలు వయస్సే కనపడ్డం లేదు. కనుబొమలు ట్రిమ్ చేసి, లైట్‌గా మేకప్ చేసుకుంది. కుడిచేతికి అరడజను బంగారు గాజులు వేసింది. అవి తళతళా మెరిసిపోతున్నాయి ఇత్తడి ముక్కల్లా.

"ఇక్కడికి మా ఇల్లు దగ్గరే. వీలున్నపుడురా! " అని ఎడ్రసిచ్చింది.

ఆ తరువాతెపుడో పదిరోజులకు గాని రాజారావుకి వేదవతి ఇంటికి వెళ్ళడానికి కుదరలేదు.

ఈ పదిరోజుల్లోనే ఆ ఇంట్లో ఆమె రాజారావుకి ఇంకోలా కనపడింది. ఓ క్షణం ఆశ్చర్యపోయాడు. ఆమె ముఖం అలసిపోయి ఉంది. పలకరింపుగా చిర్నవ్వు నవ్వింది. మేడమీదున్న ముందు హాలులో ఈజీ ఛైర్‌లో కూచుని ఉంది. ఒళ్ళో సగం చదివిన నవల, పక్కనున్న స్టూలు మీద ఎంగిలి కాఫీ కప్పులు, పళ్ళాలూ, చెమ్చాలు, గదినిండా, ఆ మూలా ఈ మూలా పుస్తకాలూ, చింకి గుడ్డలూ, తలుపు మీదా, బల్లల మీదా మాసినగుడ్డలూ... ఇల్లంతా ఏదో ముక్కువాసన. కూచోమన్నట్టు కుర్చీ చూపించింది. హాల్లో ఆ పక్కన వస్తున్న వెలుతురులో ఎవరో వ్యక్తి పుస్తకం చదువుకుంటున్నాడు. వంటి మీద మాసిన బనీనూ. అదే అవతారంలో లుంగీ. ఇటు తిరిగిచూడనన్నా లేదు.

ఆమె చూపిన కుర్చీ మీద రాజారావు కూర్చున్నాడు.

"ఇదిగో వరప్రసాద్" అని నీరసంగా పిలిచింది. ఆ మూల పుస్తకాలు చదువుకుంటున్న వరప్రసాద్ ఇటు తిరిగి చూశాడు.

"నే చెప్పలేదూ రాజారావని. అతడే ఇతడు. వీళ్ళ పెద్దక్క రుక్కూ నేనూ చదువుకునేవాళ్ళం కాకినాడలో" అంది.

ఆ వరప్రసాద్ కొంచెం కుర్చీముందుకు జరుపుకుని చదువుతున్న ఇంగ్లీష్ నవలను వేలితో గుర్తుగా పేజీలు మడిచి దూరంగా బల్లమీద పెట్టి "మీరేనన్నమాట రాజారావుగారంటే" అంటూ "నమస్తే" అన్నాడు. గడ్డం మాసి ఉంది. వెడల్పయిన ముఖంతో, తెల్లని మేనితో వరప్రసాద్ ఆరోగ్యంగానే ఉన్నాడు.

"నాకు అపుడప్పుడు గుండె నొప్పి వస్తుంటుంది. నిన్న రాత్రి కొంచెం అలాగే ఫీలయాను. డాక్టర్‌కి చూపిస్తూనే ఉంటాను. ఆయన మందులు ఇస్తూనే ఉంటాడు. ఎక్సరేలూ అయాయి. మాత్రలూ, మందులూ ఖర్చులూ. ఈ రోగం నన్ను తినేస్తోంది. ఆ మాత్రలు ,ఆ మందులూ మింగితే రెండురోజులు ఫరవాలేదు. మరచిపోయానా!? ఇంతే సంగతి. ఇప్పుడు కొంచెం పరవాలేదులే"

వరప్రసాద్ వేదవతికి వచ్చిన గుండె నొప్పి ఏరకమయినదో కొంచెం ఇంగ్లీషులో రాజారావుకి చెప్పాడు.

"ఈవిడ ఇలాగే అంటుంది. ఆ మందులవీ రోజూ వేసుకోవాలి కదా! సగం మతిమరుపు" అని కసిరి,

"టీ చేస్తానుండండి" అని లేచాడు.

ఇంతలో క్రికెట్ బ్యాట్ చప్పుడు చేసుకుంటూ ఓ కుర్రాడు వరండాలోంచి వెళ్ళిపోతున్నాడు. వేదవతి చూసి పిలిచింది. ఏమిటన్నట్టు లోపలికి చూశాడు. "వీడు మా పెద్దవాడు. విజయభాను" అంది. కోల ముఖం. ఎత్తయిన ముక్కు. పలుచని ఉంగరాల జుట్టూ. సమాధానంగా రాజారావు వేపు చిన్నగా నవ్వి వెళ్ళిపోయాడు.

పక్క గదిలోనుండి దగ్గూ, ఆ వెంటనే కాండ్రించి ఉమ్మిన శబ్దమూ వినపడ్డాయి. మరో పదినిముషాల్లో ఆ మనిషీ అదే వరండాలో నుండి నింపాదిగా నడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. అతనికి పక్షవాతం వల్ల కాలూ చెయ్యీ ఇబ్బందిగా కదులుతోంది.

"చిల్లరేమన్నా ఉందా!" అన్నాడు వేద వేపు చూస్తూ

ఆ మాటలెలాగో పెగుల్చుకుని నోటినుండి వెలువడ్డాయి. పుస్తకం మధ్యలో దాచిన పదిరూపాయల నోటు అతనికందించి "మిగిలిన చిల్లర తీసుకురా" అంది, ముఖంలో రవ్వంత విసుగుంది.

అతడెవరో రాజారావుకి పరిచయం చెయ్యలేదు. అయితే అతనిముక్కూ, కోలముఖమూ అన్నీ ఇందాక క్రికెట్ బ్యాట్ పట్టుకెళ్ళిన వాడితో సరిపోతాయి. ఇదంతా రాజారావుకి పెద్ద పజిల్‌లా ఉంది. ఆ పజిల్‌ను కప్పిపుచ్చుకునేటందుకన్నట్టు వేదవతి వేపు తిరిగి "మాత్రలు మరచిపోకుండా వేసుకోవడం మంచిది" అన్నాడు.

"ఎపుడూ వేసుకుంటూనే ఉంటాను. మొన్న రాత్రే మరచిపోయాను" అంది.

ఇంతలో వరప్రసాద్ మూడు కప్పుల్లో టీ కలిపి తీసుకొచ్చాడు.

అందులో ఓ కప్పు తీసుకోమన్నట్టు రాజారావుకి సంజ్ఞచేస్తూ "వరప్రసాద్ లేకపోతే ఏనాడో చచ్చేదాన్ని. నా ఖర్మకి ఈ దిక్కుమాలిన రోగమొకటి" అంది వేదవతి తానోకప్పు అందుకుంటూ. రెండు గుక్కలు తాగింతరువాత వరప్రసాద్ వేపు తిరిగి "రాత్రికి సాంబారు చేసేయ్!. వడియాలు వేపు కుంటే సరిపోతుంది" అని చెప్పింది

వరప్రసాద్ తల ఆడించాడు.

ఇల్లు ఓ మాదిరిగా పెద్దదే మేడమీద ఈ హాలు, రెండు గదులు ఉంచుకుని, కిందభాగమూ పక్కనున్న మరో రెండూ గదులూ అద్దెకిచ్చాననీ, దానిమీదే బతకాలనీ చెప్పింది. టీ తాగి, కప్పు బల్లమీదుంచి రాజారావు లేచాడు, ఇక వెళతానన్నట్టు. ఇంతలో మెట్లమీద నుండి విసురుగా ఓ పన్నెండేళ్ళ కుర్రాడొకడు హాల్లోకి వచ్చాడు. ముఖం నిండా చెమట. మెడలోని టైని లాగి బల్లమీద పడేసి, వీపుకు తగిలించిన పుస్తకాల సంచి తీసి బల్ల కిందకు విసిరాడు. "నా కేదీ 'టీ?' " అన్నాడు. ఇంచు మించు పొలికేక అది. అందులో అధికారం ఉంది.

"ఏమిటి వెధవా! హడావుడీ నువ్వునూ . పొయ్యి దగ్గరుంది వెళ్ళు" అన్నాడు వరప్రసాదు.

"వీడు నా రెండవవాడు. శిశిర్" అంది వేదవతి. రాజారావు వాడి వేపు చూశాడు. ఎర్రగా అందంగా బలంగా ఉన్నాడు, వరప్రసాద్ పోలికలకు దగ్గరగా.

"ఇక వెళతాను. మళ్ళా కలుద్దాం" వారి దగ్గర శెలవు తీసుకుని రాజారావు బయలుదేరాడు.

ఆ తరువాత చాలా సార్లు ఆ ఇంటికి వెళ్ళాడు. తనకు తోచినవిధంగా బ్రతుకుతున్న వేదవతి అంటే రాజారావులో చిత్రమైన అభిమానమూ, సానుభూతీ కలుగుతున్నాయి. పిల్లలు ఎదుగుతున్నారు, వాళ్ళకేమని భవిష్యతులో సమాధానం చెబుతుంది. అసలు ఈ సమాజంలో ఎలా నెగ్గుకువస్తోంది అన్న ఆలోచనే అతనిలో అపుడపుడూ కలుగుతున్నాయి.

ఒక మూడు మాటల్లో తన వివాహం గురించి చెబుతూ "నాకు చేతకాని భర్తను అంటగట్టారని నాతల్లితండ్రులమీద నెపం వేయదలచుకోలేదు. ఖర్మ సిద్ధాంతము నేను వల్లెవేయదలంచలేదు. అన్ని దార్లూ మూసుకుపోయినా, నాకు మరోదారి ఉండకపోదని

ఆశించాను. సరిగ్గా అవకాశం అలాగే వచ్చింది. పాపపుణ్యాలు బేరీజు వేసుక్కూచుంటే ఈ అవకాశమూ జారిపోవచ్చు. అయినా దానికి నేను బాధ్యురాలను కాను. కట్టబెట్టిన వరదరాజులతో నాకు సుఖంలేదు. వరప్రసాద్‌తో పరిచయం పెరిగింది. మనసులు కలిశాయి. అభిరుచులూ ఒకటే. కలిసుందామన్నాడు. అతనికి అప్పటికి పెళ్ళయి ఓ కూతురు ఉంది. ఆలోచించుకోమన్నాను. ఇటే అడుగేశాడు. ఇక ఆ తరువాత అతని భార్యా, అతని కూతురూ ఎక్కడున్నారో నాకనవసరం అనుకున్నాను. ఇప్పటికీ అదే నిర్ణయం. వరప్రసాద్‌కి జిల్లా పరిషత్‌లో ఉద్యోగం. ఇంట్లో సగం ఖర్చులు అతనివే" అంది.

***

రాజారావు ఆ రోజు వర్షంలో బస్టాండ్‌లో చెప్పినట్టే వేదవతి ఇంటికి వెళ్ళాడు. ఆమె ఆనందంగా ఉంది. ఆమె ఆరోగ్యం గురించి రెండు ప్రశ్నలు వేశాడు. బాగున్నట్టు మందులు వాడుతున్నట్టూ సమాధానం చెప్పింది. నిమ్మరసం పిండిన సేమ్యా ఉప్మా అంటూ మూడు ప్లేట్లలో చెమ్చాలతో సహా సర్ది వేడి వేడి ఉప్మాను తెచ్చి మధ్య నున్న స్టూలు మీద పెట్టాడు వరప్రసాద్. "తిను, బాగా చేస్తాడు" అని సర్దిస్తూ చేస్తూ ఓ ప్లేటందుకుంది వేదవతి. రాజారావు ఓ ప్లేటు తీసుకున్నాడు.

" నేను మరోవారం రోజుల్లో అమెరికా వెళుతున్నాను మా అబ్బాయి దగ్గరకి . ఆరునెలలవరకూ రాను" అని అన్నాడు చెమ్చాతో ఉప్మా లాక్కుంటూ రాజారావు.

"ఆరు నెలలే !?" అంది వేదవతి

"అదెంతలే. తొందరగా తిరిగిపోతాయి" అన్నాడు వరప్రసాద్. ఓ అరగంట తర్వాత ఆ కబురూ ఈ కబురూ చెప్పి వారి దగ్గర శెలవు తీసుకుని ఇంటి ముఖం పట్టాడు రాజారావు.

***

రాజారావు అమెరికా వచ్చి మూడు నెలలయ్యింది. మేరీ లాండ్ క్రాకర్ బ్రిడ్జికి దగ్గర్లో ఉన్న ఫాక్స్‌రన్ అపార్ట్‌మెంట్స్‌లో కొడుకూ కోడలూ ఉంటున్నారు. అదృష్టమేమిటంటే ఆ అపార్ట్‌మెంట్స్ దాటి కుడి ప్రక్కకు తిరిగి ఓ ఫర్లాంగు దూరం నడిస్తే చాలు పెద్ద మాల్సు వస్తాయి. అక్కడ వరండాలో చెక్కబల్లలున్నాయి. తనలాంటి మరో పదిమంది వెదర్ బాగుంటే సెల్‌ఫోన్లు పట్టుకుని అక్కడికి చేరుకుంటారు. వారిలో ఆంధ్రాలోని అన్ని జిల్లాలవారూ ఉన్నారు. ఒకరిద్దరు తమిళులూ ఉన్నారు. ఓ రెండు గంటలు సాయంకాలంపూట కాలక్షేపం, ఇండియా విశేషాలతో, అమెరికా విశేషాలూ, వింతలూ కలబోసుకుంటారు. అమెరికా ఆచారాలూ, అలవాట్లను ఇందులో కొంతమంది మెచ్చుకుంటే మరికొంతమంది తిట్టుకుంటారు. సమర్థింపు కోసం నానాతంటాలూ పడతారు మరికొందరు.

"వయసు అరవైలూ, డబ్బైలూ వచ్చేసినా చిన్న చిన్న మెట్లు కూడా ఎక్కలేని ముసలిదంపతులు. ఆ ముసలాయన చిరుగు చిరుగుల ఫ్యాషన్ జీన్స్ వేసుకుంటే, ఆ ముసలామె నెత్తిమీద బుడ్డీ జుత్తులాంటి విగ్గూ, బుగ్గలకు పెదాలకు రంగూ, కాళ్ళకు మేచింగ్ హీల్సూ, మాల్సులో అవీ ఇవీ కొనడానికి ఏం వస్తారండీ!?" అన్నాడు రాజారావొకసారి.

బల్ల చివర కూర్చున్న గుంపులోని గోవిందం ఒకడు చటుక్కున లేచి "నా బొంద వాళ్ళు భార్యా భర్తలటండీ. మావాడు చెప్పాడొకసారి. దానికి వీడు మూడో మొగుడో, ఆరో మొగుడో అయితే, వాడికి ఆమె ఐదవ పెళ్ళామో అవుతుంది. మనదేశంలోలా కాదండోయ్! ఇక్కడి పిల్లలు మదర్స్‌డేనాడు, ఫాదర్స్ డే నాడు తప్ప తల్లితండ్రుల్ని చూడరు. రెక్కలొస్తే చాలు ఓ గుంటని తీసుకుని ఎగిరిపోవడమే. వయసులో ఉన్నన్నాళ్ళూ వీలయినంతమందిని మార్చి, ఇంక వయసు అయిపోయే ముందు కూతురినో, కొడుకునో కని ఉంటే ఆమెతోనో, ఆయనతోనో ఉంటారు. లేకపోతే ఇదే గోల. మన దేశంలోలా కులాలూ, మతాలూ, కట్టుబాట్లు ఏమీ ఉండవు. దీనికే ముద్దు పేరు 'కలిసి ఉండటం' ఏది ఏమన్నా రాజారావుగారూ ఈ పెద్ద వయసులో తోడు ప్రధానం దానికి వీళ్ళు ముఖ్యమైన విలువిస్తారు. తప్పదు." అన్నాడు.

రాజారావుకి ఆ తరువాత కొన్ని వందల జంటలు అలాంటివి కనపడ్డాయి. కొంత వయస్సు మళ్ళిన వారయితే, కొందరు వయసులో ఉన్నవారు, నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు, నలుపు తెలుపూ వాళ్ళూ ఇలా ఎన్నో జంటలు!!.

అకస్మాత్తుగా అతని మనస్సులో వేదవతి, వరప్రసాద్ లూ మెదిలారు. వారూ అంతేనేమో అనుకున్నాడు.

ఆరు నెలలు ఇట్టే తిరిగిపోయాయి . ఇండియా చేరిన రాజారావుకి వేదవతిని చూడాలనిపించింది. తీరిక చేసుకుని వారింటికి వెళ్ళాడు. పైకెళ్ళి మెట్లవంపు దగ్గరనుండి చూస్తే ఇంటికి తాళం వేసి ఉంది. కిందకి దిగి అద్దెకున్న వారినడిగితే ఓ ముసలాయన ముందుకొచ్చి అన్నాడు. "వేదవతిగారు చనిపోయి రెండు నెలలయ్యింది. వరప్రసాద్‌గారి మొదటి భార్య వచ్చి ఆయన్ని తన ఇంటికి తీసుకుపోయింది. ఇంతకూ మీరెవరు?"

రాజారావు షాక్ తిన్నాడు.

కొంచెం తేరుకుని మెల్లగా అన్నాడు. "వాళ్ళు నాకు తెలిసిన వారు" అని సమాధానం చెప్పి గబగబా రోడ్డు మీదకు వచ్చాడు. మెల్లగా అడుగులు వేస్తూ ఆలోచిస్తున్నాడు. ఇంతకీ .. మెకతను? వరప్రసాద్‌గారు ఏమీ కాడా? ఇదేనా కలిసి ఉండటమంటే?

✡ ✡ ✡



ప్రముఖ చిత్రకారులు బాలి గారు 'కౌముది' కోసం ప్రత్యేకంగా వ్రాసిన తాజా కథ ఇది.